సాక్షి ప్రకాశం

సోమవారం । 2 । సెప్టెంబర్ । 2024



కంభం చెరువుకు జలకళ

నల్లమలలో కురిసిన భారీ వర్షానికి చారిత్రాత్మక కంభం చెరువుకు వరద నీరు భారీగా చేరుతోంది. దీంతో సందర్శకుల సంఖ్య పెరుగుతోంది.

-10లో..



సీపీఎస్ రద్దు చేయండి

సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ ఎస్టీయూ, ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

-10లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30/23

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉరుములు మెరుపులతో చిరుజల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

నేడు వైఎస్సార్ 15వ వర్ధంతి

ఒంగోలు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం ఒంగోలులో మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదేశాలమేరకు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు కటారి శంకరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు చర్చిసెంటర్‌లోని డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పిస్తారని, 10.45 గంటలకు మినీ స్టేడియం వెనుక వైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తారని చెప్పారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి హాజరవుతారని, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, డైరెక్టర్లు, జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు పాఠశాలలకు సెలవు

ఒంగోలు అర్బన్: భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, కళాశాలలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని కోరుతూ ఆదివారం ప్రకటన విడుదల చేశారు.

మర్లపాడు చెరువుకు నీరు

సాక్షి ఎఫెక్ట్..

టంగుటూరు: టంగుటూరు మండలంలోని మర్లపాడు చెరువుకు రావాల్సిన సాగర్ జలాలను టీడీపీ నాయకుడు రామా గోపి అడ్డుకోవడంపై 'సాక్షి'లో 'తాగునీరు స్వాహా!' శీర్షికతో ఆదివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఇప్పటికే కొణిజేడు గ్రామ చెరువు కొంత మేర నిండటం, మర్లపాడు తాగునీటి చెరువుకు తగినన్ని నీరు లేకపోవడంతో కందులూరు మైనర్ కట్టను పునరుద్ధరించి కొణిజేడు గ్రామ చెరువు పోయే నీటిని ఆపి మర్లపాడు చెరువుకు నీటిని సరఫరా చేస్తున్నారు.



సాగర్ నీటి కట్ట వేసి మర్లపాడు నీరు వదులుతున్న దృశ్యం

కరువు నేలపై రాజముద్ర




దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఐదున్నరేళ్ల పాలన స్వర్ణయుగమే.
అన్ని వర్గాల వారినీ అక్కున చేర్చుకొని తన పాలన సాగించారు. ప్రతి ఇంటి ముంగిటా ఆ అభివృద్ధి వెలుగులే...ప్రతి పేద గుండెలో ఆ నిండైన రూపమే.. బీడువారిన నేలతల్లికి జలసిరులందించిన భగీరథునిలా జలయజ్ఞం.. లయతప్పిన పేద గుండెకు ఊపిరిలూదిన దైవంలా ఆరోగ్య శ్రీ... చదువు "కొనలేక" పేదింటి అక్షరం చిన్నబోతే ఫీజు రీయింబర్స్‌మెంట్.. వయసుడిగిన నాడు ఆసరాలేక వృద్ధాప్యం ఉసూరుమంటే ఇంటికి పెద్ద కొడుకై ఆదుకున్న ఆపన్న హస్తంలా వృద్ధాప్య పింఛన్.. తెలుగుదనానికి నిండైనా రూపంలా నిలిచిన వైఎస్సార్ 15వ వర్ధంతి నేడు. ఈ సందర్భంగా జిల్లాకు వైఎస్సార్ అందించిన అభివృద్ధి ఫలాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

- స్వర్ణయుగంలా వైఎస్సార్ పాలన
- రామతీర్థం, గుండ్లకమ్మ ప్రాజెక్టులతో తీరిన సాగు, తాగునీటి కొరత
- శరవేగంగా వెలిగొండ ప్రాజెక్టు పనులు
- మహానేత ఆశయాలు కొనసాగించిన తనయుడు వైఎస్ జగన్
- వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి
- నేడు దివంగత మహానేత డాక్టర్ వైఎస్ఆర్ 15వ వర్ధంతి

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జిల్లాలో ప్రవేశపెట్టిన పథకాలు నేడు ఫలప్రదమయ్యాయి. నాడు మహానేత వేసిన అడుగులు జిల్లాలోని ప్రజలకు ఫలాలు అందిస్తున్నాయి. వైఎస్సార్ ఆలోచనలను ముందుకు తీసుకెళ్లటంలో ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల తన పాలనలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. సాగు, తాగు నీటి ప్రాజెక్టులు, రైతన్నల విషయంలో వైఎస్సార్ ఎంతో ముందు చూపుతో అడుగులు ముందుకేస్తే.. ఆయన తనయుడు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ గ్రామ స్వరాజ్యాన్ని స్థాపించారు. రైతులు తీసుకున్న పంట రుణాలు రద్దు చేసి ఉచిత విద్యుత్ అందించి మహానేత రైతు బాంధవుడయ్యాడు. ఆయన తనయుడు మరో అడుగు ముందుకేసి గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థకు ఊపిరిపోసి, గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలు నెలకొల్పి ఏ అవసరం వచ్చిన గ్రామం దాటి బయటకు వెళ్లకుండా అన్నీ అక్కడే సమకూర్చారు.

గుండ్లకమ్మతో ఎంతో ప్రయోజనం

జలయజ్ఞంలో భాగంగా డాక్టర్ వైఎస్ఆర్ గుండ్లకమ్మ ప్రాజెక్టును నిర్మించారు. దీంతో సంతనూతలపాడు, ఒంగోలు, పర్చూరు నియోజకవర్గాల్లో రెండు సీజన్లలో కలుపుకొని 85 వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నారు. వెలిగొండ ప్రాజెక్టును వైఎస్ఆర్ హయాంలో వేగవంతంగా పనులు చేపట్టారు. రూ.8,600 కోట్లు కేటాయించారు. టీడీపీ హయాంలో చంద్రబాబు వెలిగొండను పట్టించుకోలేదు. ఆ తరువాత 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ రివర్స్ టెండర్ల ద్వారా ప్రభుత్వ ఖజానాకు ఆదా చేయడంతో పాటు కాంట్రాక్టర్లను మార్చి ఒకటో టన్నెల్‌ను వడివడిగా పూర్తి చేయించారు. పునరావాస పనులు కూడా వేగవంతంగా సాగుతున్నాయి. రెండో టన్నెల్ నిర్మాణ పనులు కూడా పూర్తి చేశారు. రెండో టన్నెల్ పూర్తయిన సమయానికి శ్రీశైలం జలాశయంలో నీళ్లు సరిపడా లేకపోవటంతో రెండు టన్నెళ్ల ద్వారా నీళ్లు విడుదల చేయటానికి వీలులేకపోయింది.



గుండ్లకమ్మ ప్రాజెక్టు

ఉచిత విద్యుత్‌తో వెలుగులు...

2004 మే నెలకు ముందు జిల్లాలో 63,559 మంది రైతుల కరెంట్ బకాయిలు రూ.59.5 కోట్లు వైఎస్సార్ రద్దు చేశారు. అప్పటికే ఉన్న 71,321 మంది రైతులకు ఉచిత విద్యుత్ అందించారు. ఐదేళ్లలో మొత్తం 86,207 మంది రైతులు ఉచిత విద్యుత్ పొందారు. అందుకోసం అప్పట్లో రూ.65 కోట్ల వరకు ఖర్చు చేశారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఉచిత విద్యుత్ పొందే రైతుల సంఖ్య 1.93 లక్షలకు చేరింది.

వైఎస్సార్ ఐదేళ్ల పాలనలో జిల్లాలో ప్రాజెక్టులకు భారీగా నిధుల వరద కురిపించారు. జిల్లాలో 24.37 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేలా చర్యలు చేపట్టారు. గ్యాప్ ఆయకట్టుగా ఉన్న 11.11 లక్షల ఎకరాలకు నీరు ఇవ్వటానికి ప్రత్యేక ప్రణాళిక ద్వారా చర్యలు తీసుకున్నారు. ఐదేళ్లలో అన్ని ప్రాజెక్టులకు కలిపి రూ.6,280.11 కోట్లు ఖర్చు చేశారు. సాగునీటి ప్రాజెక్టులకు ఇంత మొత్తంలో కేటాయించిన సీఎం వైఎస్సార్ ఒక్కరే. ఆ తరువాత ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాటిని కొనసాగిస్తూ ముందుకు వెళ్లారు.

- జిల్లాలోని 63,346 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు వైఎస్సార్ రూ.30 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చారు. రూ.75 కోట్లు పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలు అందించారు. కార్పొరేట్ విద్యా పథకంలో భాగంగా 300 మంది విద్యార్థులకు కార్పొరేట్ తరహా విద్య అందించేందుకు చర్యలు చేపట్టారు.
- పేదలందరికీ పింఛన్లు అందించారు. 2004 ముందు 2.86 లక్షల మందికి పింఛన్లు ఉన్నాయి. ఇందిరమ్మ మూడు దశల కార్యక్రమాల కింద అదనంగా 1.79 లక్షల మందికి నూతనంగా పింఛన్లు మంజూరు చేశారు. ఏటా అదనంగా రూ.69 కోట్లు పింఛన్ల రూపంలో చెల్లించారు. పావలా వడ్డీ కింద రూ.20 కోట్లు పొదుపు గ్రూపులకు రీయింబర్స్‌మెంట్ ఇచ్చారు. బ్యాంకు లింకేజి రుణాలు రూ.853 కోట్లు మంజూరు చేయించారు.
- జిల్లాలో 7.19 లక్షల మందికి హెల్త్ కార్డులు అందించారు. 10,366 మందికి గుండె ఆపరేషన్లు చేయించారు. ఆరోగ్య శ్రీ ప్రారంభం సందర్భంగా జిల్లాలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహించి 70 వేల మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేయించారు. జిల్లా కేంద్రం ఒంగోలులో రిమ్స్ మెడికల్ కాలేజీని మంజూరు చేయించారు. 37.46 ఎకరాల్లో అప్పట్లో దాదాపు రూ.250 కోట్లు వెచ్చించి మెడికల్ కళాశాల, 1,000 పడకల రిమ్స్ వైద్యశాలల నిర్మాణాలు చేపట్టారు.
- వైఎస్సార్ ఐదేళ్లలో 3,22,630 గృహాలు నిర్మించి పేదలకు అందించారు. నివేశన స్థలాలకు రూ.కోట్లు వెచ్చించారు. 19,904 మంది భూమి లేని నిరుపేదలకు 31,734 ఎకరాలు ఏడు విడతల్లో పంపిణీ చేశారు.
- జిల్లాలో రూ.400 కోట్లతో సాగర్ కాలువల ఆధునికీకరణ పనులు చేపట్టడంతో జిల్లాలోని 4.50 లక్షల సాగర్ ఆయకట్టు సస్యశ్యామలం అయింది. దీంతో యర్రగొండపాలెం, దర్శి, అద్దంకి, పర్చూరు. సంతనూతలపాడు, మార్కాపురం, ఒంగోలు నియోజకవర్గాల రైతులకు మేలు చేకూరింది.
- దర్శి నియోజకవర్గంలో రూ.120 కోట్లతో రక్షిత మంచినీటి పథకం, రూ.2 కోట్లతో మార్కెట్ యార్డు నిర్మించారు.
- కనిగిరి నియోజకవర్గంలో రూ.175 కోట్లతో రక్షిత మంచినీటి పథకం మంజూరు చేశారు.
- కందుకూరు పట్టణ ప్రజలకు రూ.110 కోట్లతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించారు. రూ.80 కోట్లతో రాళ్లపాడు ప్రాజెక్టు అనుసంధానం కోసం సోమశిల ప్రాజెక్టు నుంచి ఉత్తర కాలువ నిర్మించారు.
- గిద్దలూరులో రూ.12 కోట్లతో బైరేనిగుండాల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. రూ.22 కోట్లతో రామన్న కతువ ప్రాజెక్టు నిర్మించారు.
- చీరాల, పర్చూరుల్లో కృష్ణా డెల్టా ఆధునికీకరణకు రూ.2 వేల కోట్లు కేటాయించారు. చేనేతలకు 50 సంవత్సరాలకే పింఛన్ అందించారు.
- అద్దంకిలో రూ.400 కోట్లతో నార్కెట్‌పల్లి, అద్దంకి, మేదరమెట్లకు రాష్ట్రీయ రహదారి నిర్మించారు. 5 వేల ఎకరాలకు సాగునీరందించే యర్రం చినపోలిరెడ్డి ఎత్తిపోతల పథకం మంజూరు చేశారు.

వేగంగా రామాయపట్నం పోర్టు పనులు...

రామాయపట్నం పోర్టుకు ఎట్టకేలకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు శంకుస్థాపన చేయటంతో పాటు పోర్టు పనులు వేగంగా చేపట్టారు. 2019 ఎన్నికలకు ముందు అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తూ...తూ మంత్రంగా పైలాన్ ఓపెన్ చేసి ప్రజలను మోసం చేయాలని చూశాడు. వైఎస్ జగన్ పోర్టుకు 2022 జూలై 20న శంకుస్థాపన చేసి మొత్తం రూ.10,640 కోట్ల వ్యయ అంచనాలతో రూపొందించిన పోర్టు పనులు వేగవంతంగా చేపట్టారు.

రూ.813 కోట్లతో రెండు ఫిషింగ్ హార్బర్లు మంజూరు

నూతన ప్రకాశం జిల్లాలోని కొత్తపట్నం సముద్ర తీరంలో, నూతన బాపట్ల జిల్లాలోని ఓడరేవు సముద్ర తీరంలో రెండు ఫిషింగ్ హార్బర్లు నిర్మించేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.813 కోట్లు మంజూరు చేసింది. అందుకోసం రెండు ప్రాంతాల్లో 67.71 ఎకరాలను కేటాయించి రెవెన్యూ అధికారులు ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డుకు అప్పగించారు. అన్నిరకాల అనుమతులు మంజూరు చేశారు. టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. కొత్తపట్నం సముద్రతీరంలో నిర్మించే ఫిషింగ్ హార్బరుకు రూ.392 కోట్లు గత ప్రభుత్వం మంజూరు చేసింది. అందుకుగాను 32 ఎకరాలను గత ప్రభుత్వం కేటాయించింది. చీరాల మండలం ఓడరేవు ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి రూ.421 కోట్లు మంజూరు చేసింది. అందుకుగాను 35.71 ఎకరాలను కేటాయించింది. ఈ రెండు ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం పూర్తయితే జిల్లాలో ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 40 వేల మందికి ఉపాధి అవకాశాలు దక్కేవి. ఇక పనులు ప్రారంభించాలి అనుకునే సమయంలో 2024 సాధారణ ఎన్నికలు రావటంతో పనులు నిలిచిపోయాయి. చంద్రబాబు ఆ ఎన్నికల్లో విజయం సాధించి అధికారాన్ని చేపట్టింది. కానీ పాలన చేపట్టి మూడు నెలలుదాటినా ఇప్పటికీ వాటి ఊసే లేదు. దీంతో తీర ప్రాంత ప్రజలు చంద్రబాబు పాలనపై తీవ్ర అసహనంతో ఉన్నారు.

పుల్లలచెరువుకు మండలానికి కృష్ణమ్మ పరవళ్లు తొక్కించేందుకు తీగలేరు కాలువకు రూ.82 కోట్లు కేటాయిస్తూ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వైఎస్ జగన్ ఉత్తర్వులు జారీ చేశారు. తద్వారా మండలంలోని 11,500 ఎకరాల బీడుభూములు సస్యశ్యామలం కానున్నాయి. ఆ ప్రాజెక్టును కూడా చంద్రబాబు ప్రభుత్వం కనీసం పట్టించుకోవటం లేదు.



పూర్తయిన వెలిగొండ ప్రాజెక్టు రెండో టన్నెల్

పొంగిన వాగులు

- వాయుగుండం ప్రభావంతో జిల్లాలో భారీ వర్షం
- పలుచోట్ల నీట మునిగిన పంట పొలాలు
- పరవళ్లు తొక్కిన తీగలేరు, దొంగల వాగు, గుండ్లకమ్మ
- జల దిగ్బంధంలో చర్లోపల్లి, గంటవానిపల్లె గ్రామాలు
- దొంగలవాగు పోటెత్తటంతో 7 గంటల పాటు ట్రాఫిక్ జాం



చోళ్లవీడు వద్ద కంభం చెరువుకు పరుగులు పెడుతున్న గుండ్లకమ్మ



ప్రవహిస్తున్న దోర్నపు వాగు

ఒంగోలు సెంట్రల్: తీవ్ర వర్షాభావంతో అల్లాడుతున్న జిల్లా ప్రజలకు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు కాస్త ఊరటనిచ్చాయి. ఎండు ముఖం పట్టిన పైర్లకు వర్షం ఊపిరి పోసింది. అయితే పలుచోట్ల పంట పొలాలు నీట మునిగాయి. కొన్ని పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనాలు వేశారు. ఆదివారం జిల్లాలో 38 మండలాల్లో సరాసరి 58.5 మి.మీల మేర వర్షపాతం నమోదైంది. శని, ఆదివారాలు కలిపి జిల్లాలో 3180.4 మి.మీల మేర, సరాసరి 83.7 మి.మీలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. వర్షానికి, గాలులకు ఖరీఫ్‌లో సాగు చేసిన నువ్వులు, కొర్ర, సజ్జ ఆరు మండలాల్లో 3335 ఎకరాలు సాగు చేయగా అందులో 668 మంది రైతులకు చెందిన 907.5 ఎకరాలు దెబ్బతిన్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు.

ఏ మండలంలో ఎంతంటే..

ముండ్లమూరు మండలంలో అత్యధికంగా 138 మి.మీలు నమోదు కాగా, కనిష్టంగా పీసీపల్లి మండలంలో 27.6 నమోదైంది. మిగిలిన మండలాల్లో త్రిపురాంతకం 106.2, నాగులుప్పలపాడు 96.4, మద్దిపాడు 86.2, కురిచేడు 94, తాళ్లూరు 94.8, పుల్లలచెరువు 96.2, చీమకుర్తి 75.8, మార్కాపురం 76.4, దోర్నాల 64.8, దొనకొండ 77.4, పొదిలి 71.2, యర్రగొండపాలెం 64, కొనకనమిట్ల 62, ఒంగోలు 52.8, తర్లుపాడు 69.8, దర్శి 46.8, పెద్దారవీడు 42.4, కంభం 59.6, గిద్దలూరు 44.8, సంతనూతలపాడు 51.8, కొండపి 47.4, బేస్తవారిపేట 55.6, కొత్తపట్నం 49.2, రాచర్ల 46.8, హనుమంతునిపాడు 41, కనిగిరి 44.2, మర్రిపూడి 57, వెలిగండ్ల 35.2, పామూరు 34.2, సింగరాయకొండ 27.6, అర్థవీడు 41.2, జరుగుమల్లి 29.4, పొన్నలూరు 28, సీఎస్‌పురం 25.8, కొమరోలు 29.4, టంగుటూరు 33.8 నమోదైనట్లు అధికారులు తెలిపారు.

పుల్లలచెరువు మండలంలోని చన్నకండ్లేరు ప్రాజెక్టుకు 20 అడుగుల మేర నీరు చేరింది. ఈ ప్రాజెక్టు కింద 2 వేల ఎకరాలు సాగు చేస్తున్నారు. ప్రాజెక్టు కట్టకు గతంలో పడిన రంధ్రం పూడ్చేందుకు పోసిన మట్టి దిగజారడంతో మట్టికట్ట బలహీనపడి ఎప్పుడు ఏం జరుగుతోందనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

త్రోవగుంట నుంచి వాహనాల దారి మళ్లింపు

ఒంగోలు టౌన్: కాజా టోల్‌గేట్ దగ్గర భారీగా వరద నీరు చేరడంతో అత్యవసర పనుల మీద ఒంగోలు పరిసర ప్రాంతాల నుంచి విజయవాడ వైపు వెళ్లే ప్రయాణికులు నానా ఇబ్బందులు పడ్డారు. వారి కోసం త్రోవగుంట వద్ద పోలీసులు వాహనాల దారి మళ్లించారు. త్రోవగుంట నుంచి చీరాల మీదుగా తెనాలి, రేపల్లె మార్గాల గుండా వాహనాలను విజయవాడ వెళ్లేలా ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి 7 గంటల నుంచి ఆదివారం తెలవారు జామువరకు పోలీసు యంత్రాంగం వాహనాలను మళ్లించినట్లు అధికారులు తెలిపారు. ఆదివారం వరద నీటి ప్రవాహం తగ్గిడంతో తిరిగి యథావిధిగా వాహనాలు నడుస్తున్నాయని తెలిపారు.

పరవళ్లు తొక్కుతున్న గుండ్లకమ్మవాగు

రాచర్ల: నల్లమల అటవీ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి గుండ్లకమ్మవాగు పరవళ్లు తొక్కుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది. నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానం సమీపంలోని నీటి గుండంలోని గుండ్లకమ్మ వాగు ద్వారా భారీగా వరదనీరు చేరుతుండటంతో ఆలయానికి వెళ్లే మార్గం అంతటా నీటి మంచుతో కప్పుకునిపోయింది. గుండ్లకమ్మవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రామన్నకతువతో పాటు చినగానిపల్లె గ్రామంలోని రంగయ్యనాయుడు చెరువు నిండి అలుగుపారుతోంది. ఆకవీడు ఎర్రదిన్నె చెరువుకు నీరు చేరుతోంది.

రిజర్వాయర్ నుంచి 18 వేల క్యూసెక్కుల నీరు విడుదల

మద్దిపాడు: మండలంలోని మల్లవరం వద్ద ఉన్న కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ జలాశయం నుంచి నాలుగు గేట్ల ద్వారా 18 వేల క్యూసెక్కుల నీరు గుండ్లకమ్మ నదిలోకి వదిలేస్తున్నట్లు డ్యామ్ ఏఈ రామాంజనేయులు తెలిపారు. గుండ్లకమ్మ నది పై భాగంలో శనివారం కురిసిన భారీ వర్షాల కారణంగా నదిలోకి భారీగా వరద నీరు చేరుతోంది. ఆదివారం ఉదయం రిజర్వాయర్‌లో 20.60 మీటర్ల ఎత్తు వరకూ (ఒక్క టీఎంసీ నీరు) నీటిని నిల్వ చేసి పైన వచ్చే నీటిని గుండ్లకమ్మ నదిలోకి విడుదల చేస్తున్నారు. ఉదయం 4 వేల క్యూసెక్కుల నీరు వదలగా మధ్యాహ్నానికి వరద ఉధృతి పెరగడంతో 18 వేల క్యూసెక్కుల నీరు కిందకు విడుదల చేస్తున్నారు. ఆదివారం రాత్రి వరకూ వరద ఉధృతి కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గుండ్లకమ్మ నదిలోకి వరద నీరు వదులుతున్న క్రమంలో గుండ్లకమ్మ నదీ పరివాహక గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్‌ను మద్దిపాడు తహశీల్దార్ సుజన్ కుమార్ ఆదివారం మధ్యాహ్నం సందర్శించారు. వరద ఉధృతి గురించిన సమాచారం తెలుసుకున్నారు.

పాకలలో 30 అడుగులు వెనక్కి వెళ్లిన సముద్రం

సింగరాయకొండ: వాయుగుండం ప్రభావంతో ఊళ్లపాలెం, పాకల తీరంలో సముద్రం సుమారు 30 అడుగులు వెనక్కి వెళ్లిందని మత్స్యకారులు తెలిపారు. అలల ఉధృతి పెద్దగా లేకపోవడంతో చుట్టుపక్కల మండలాల మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లారని వారికి రొయ్యలు విరివిగా పడ్డాయని స్థానిక మత్స్యకారులు తెలిపారు. తుఫాన్ హెచ్చరికలు నేపథ్యంలో కూడా తమిళనాడు రాష్ట్రానికి చెందిన సోనాబోట్లు నిబంధనలకు విరుద్ధంగా సుమారు కిలోమీటరు దూరంలో చేపల వేట సాగించాయి. సుమారు 20కి పైగా సోనాబోట్లు తీరంలో చేపల వేట సాగించినట్లు మత్స్యకారులు తెలిపారు.



ఊళ్లపాలెం తీరంలో సుమారు 30 అడుగులు లోపలికి పోయిన సముద్రం

నల్లమలలో భారీ వర్షం

పెద్దదోర్నాల: నల్లమల అభయారణ్యంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు వాగులు పొంగి ప్రవహిస్తుండటంతో పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఆయా గ్రామాలకు నిత్యావసరాలు అందక ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో పాటు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు భారీ అంతరాయం ఏర్పడింది. కర్నూలు, గుంటూరు రహదారిలోని రోళ్లపెంట సమీపంలో కొండచెరియలు విరిగి పడటంతో దోర్నాల-ఆత్మకూరు మధ్య ఘాట్ రోడ్డులో ప్రయాణాలను పూర్తిగా నిలిపివేశారు. వాహనాలను జిల్లాలోని దేవరాజుగట్టు, గిద్దలూరు, నంద్యాల మీదుగా మళ్లించారు.

జలదిగ్బంధంలో పలు గ్రామాలు:

రెండు రోజులుగా అటవీ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో మండల పరిధిలోని తీగలేరు, దొంగల వాగు, రాళ్లవాగులు పొంగటంతో వై.చర్లోపల్లి, గంటవానిపల్లె, కడపరాజుపల్లె గ్రామాలు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు బయటకు రాలేకపోయారు. కర్నూలు, గుంటూరు రహదారి నుంచి తీగలేరు మీదుగా గంటవానిపల్లి గ్రామానికి నిర్మించే హైలెవల్ బ్రిడ్జికి సంబంధించి గత ప్రభుత్వం రూ.270 కోట్లు మంజూరు చేసింది. అయితే ఇంత వరకు బ్రిడ్జి నిర్మాణం మొదలు కాలేదు.



చిన్నదోర్నాల వద్ద తీగలేరు ఉధృతి

భారీగా ట్రాఫిక్ ఇబ్బందులు:

నల్లమలలో కురిసిన భారీ వర్షాలకు పలు ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. పెద్దదోర్నాల మండలంలో దొంగలవాగు ఉధృతంగా ప్రవహించటంతో కర్నూలు రహదారిలో రాత్రి 11 నుంచి ఉదయం 6 గంటల వరకు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో నట్టనడివిలో వాహనాలు నిలిచి పోవటంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. ట్రాఫిక్ అంతరాయం తొలగే వరకు చిమ్మచీకటిలో, చలి తీవ్రతలకు అల్లాడిపోయారు. నీటి కోసం, తిండి కోసం చిన్నారులు పడిన బాధలు వర్ణనాతీతం. దీంతో పాటు తీగలేరు వాగు ఉధృతంగా ప్రవహించటంతో చిన్నదోర్నాల వద్ద వాహనాల రాకపోకలకు కొన్ని గంటల పాటు అంతరాయం ఏర్పడింది.



పెద్ద నల్ల కాలువ వద్ద నీట మునిగిన పంటను పరిశీలిస్తున్న ఏడీఏ



జలదిగ్బంధంలో గంటవానిపల్లె



తాళ్లూరులో పొలంలో నిలిచిన నీరు



మార్కాపురం మండలం తిప్పాయిపాలెంలో నీట మునిగిన పత్తి పంట

క్లుప్తంగా

అపుస్మా జిల్లా అధ్యక్షునిగా మాధవరావు



అపుస్మా జిల్లా నూతన కార్యవర్గం

ఒంగోలు: ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అపుస్మా) జిల్లా అధ్యక్షునిగా కొల్లా మాధవరావు (వీఎస్‌జీ పాఠశాల) ఎంపికయ్యారు. ఆదివారం స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో నూతన కార్యవర్గ ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల ప్రత్యేక అధికారిగా నెల్లూరుకు చెందిన సుబ్బారెడ్డి, సమన్వయకర్తగా ఏవీ సుబ్బారావు వ్యవహరించారు. ప్రకాశం జిల్లాలోని 8 నియోజకవర్గాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో పాటు అపుస్మా సభ్యులు హాజరై నూతన కార్యవర్గాన్ని అభినందించారు. గౌరవాధ్యక్షునిగా బి.హనుమంతరావు (సంతనూతలపాడు), కార్యదర్శిగా జి.మల్లికార్జునరెడ్డి (మార్కాపురం), కోశాధికారిగా ఎం.వెంకటేశ్వరరెడ్డి (కనిగిరి), ఉపాధ్యక్షునిగా జి.రంగస్వామిరెడ్డి (గిద్దలూరు), సంయుక్త కార్యదర్శిగా పి.నాగేశ్వరరావు (ఒంగోలు), కార్యవర్గ సభ్యులుగా జి.లక్ష్మణ్ (కొండపి), ఎం.మల్లికార్జునరావు (పెదదోర్నాల), ఆర్.లక్ష్మీనారాయణ (దర్శి) ఎన్నికయ్యారు.

సెపక్ తక్రా జిల్లా అధ్యక్షునిగా యనమల

ఒంగోలు: సెపక్ తక్రా జిల్లా అధ్యక్షునిగా యనమల సురేష్‌ను ఎన్నుకున్నట్లు సెపక్‌తక్రా జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానికంగా నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఈ ఎంపిక జరిగిందన్నారు. ఈయన 4 సంవత్సరాల పాటు ఈ పదవిలో ఉంటారని చెప్పారు.



జలకళ సంతరించుకున్న చారిత్రాత్మక కంభం చెరువు




చెరువుకట్టపై సందర్శకుల కోలాహలం

కంభం చెరువుకు జలకళ

- సందర్శకుల తాకిడితో కోలాహలంగా మారిన చెరువుకట్ట
- చెరువు అందాలు తిలకిస్తూ, సెల్ఫీలు దిగుతూ సందర్శకుల సందడి

కంభం: నల్లమలలో కురిసిన భారీ వర్షానికి ఆసియా ఖండంలో రెండో అతిపెద్దదైన చారిత్రాత్మక కంభం చెరువుకు గుండ్లకమ్మ, జంపలేరు వాగుల ద్వారా భారీగా వరదనీరు వచ్చి చేరుతుండటంతో జళకళ సంతరించుకుంది. ఇప్పటికే కంభం చెరువులో మూడు అడుగుల మేర నీరు ఉండగా ప్రస్తుతం చేరుతున్న వరదనీటితో నీటి మట్టం పెరుగుతుంది. కంభం చెరువుకు నీరు చేరుతుందని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీగా కంభం చెరువుకట్టపైకి తరలి వచ్చారు. ఆదివారం కావడంతో పిల్లా పాపలతో కలిసి చెరువుకట్టపైకి ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లలో తరలివస్తున్నారు. కంభం చెరువుకట్టపై సందర్శకుల తాకిడి చూస్తుంటే వినాయకచవితి పండుగ వారం రోజుల ముందే వచ్చేసిందా అని అనిపిస్తుంది. చెరువు అందాలను తిలకిస్తూ సెల్ఫీలు దిగుతూ సందర్శకులూ సాయంత్రం వరకు సందడి చేశారు.



చెరువుకట్టకు ఆనుకొని వెళ్తున్న రైలు



కంభం చెరువుకట్ట వద్ద రెండుకొండల పక్క నుంచి వెళ్తున్న రైలు



కంభం చెరువుకట్టపైకి తరలివస్తున్న యువకులు

స్వస్థలానికి యువకుడి మృతదేహం

- మృతి చెందిన 23 రోజుల తరువాత ఆర్మేనియా నుంచి స్వదేశానికి.
- మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమైన మృతుడి తల్లిదండ్రులు



శివనారాయణ మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి, కుటుంబ సభ్యులు



ఒంటేరు శివనారాయణ (ఫైల్ ఫొటో)

పెద్దదోర్నాల: ఎన్నో ఆశలతో ఉద్యోగరీత్యా విదేశాలకు వెళ్లిన కుమారుడు విగతజీవిగా తిరిగి వస్తాడని ఊహించని ఆ తల్లిదండ్రులు తమ కుమారుడి మృతదేహాన్ని చూసి గుండెలవిసేలా రోదించారు. ఆర్మేనియాలో గత నెలలో మృతి చెందిన ఒంటేరు శివనారాయణ(31) మృతదేహాన్ని ఆదివారం పెద్దదోర్నాల మండలం హసానాబాదకు తీసుకువచ్చారు. హసానాబాదకు చెందిన చిన్న ఆవులయ్య, రాజేశ్వరి దంపతులకు నలుగురు అమ్మాయిలుతో పాటు శివనారాయణ ఒక్కడే మగ సంతానం. బీటెక్ పూర్తి చేసిన శివనారాయణ బెంగళూరులోని ఓ కంపెనీలో ఉద్యోగం చేశాడు. విదేశాల్లో ఉద్యోగం చేయాలన్న సంకల్పంతో 8 నెలల క్రితం కొంత మంది ద్వారా యూరప్ ఖండంలోని ఆర్మేనియాలో ఉద్యోగం సంపాదించాడు.

ఈ క్రమంలో గత 48 రోజుల క్రితం తల్లిదండ్రులకు తాను మరో కంపెనీలో ఉద్యోగంలో చేరానని, అక్కడే నలుగురు కలిసి రూం తీసుకుని ఉంటున్నామని తెలిపాడు. ఈ క్రమంలోనే ఓ రోజు పార్టీ చేసుకున్న మిత్రులు తనకు ఓ బాటిల్లో నీరు ఇచ్చారని, అది తాగిను తరువాత వాంతులు, విరోచనాలవుతున్నాయని తల్లిదండ్రులకు ఫోన్‌లో తెలిపాడు. చికిత్స నిమిత్తం వైద్యశాలలో చేరినట్లు సమాచారం అందించాడు. అయితే ఎమైందో ఏమో కానీ శివనారాయణ చనిపోయాడంటూ తోటి ఉద్యోగులు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో అంతుచిక్కని కుమారుడి మరణంలో కంటి మీద కునుకు లేకుండా కుమారుడి మృతదేహం కోసం రోదిస్తూ ఎదురుచూశారు. ఈ క్రమంలో ఆదివారం విదేశాల నుంచి తీసుకువచ్చిన కుమారుడి మృతదేహాన్ని చూడటంతో ఒక్కసారిగా గుండెలవిసేలా విలపించారు. ఆదివారం వేకువజామున ఆర్మేనియా నుండి విమానంలో వచ్చిన మృతదేహాన్ని స్వాధీన పర్చుకున్నారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అంబులెన్స్‌లో మృతదేహాన్ని రోడ్డు మార్గాన స్వగ్రామమైన హసానబాదకు తరలించారు. ఈ క్రమంలో ఆదివారంమే మృతదేహానికి అంతిమక్రియలు నిర్వహించారు. బంధుమిత్రులు, సన్నిహితులు, యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు శివనారాయణ మృతదేహానికి నివాళులర్పించారు.

సీపీఎస్ అంతం.. ఎస్‌టీయూ పంతం



నిరసన తెలియజేస్తున్న ఎస్‌టీయూ నాయకులు

ఒంగోలు: సీపీఎస్ అంతం.. ఎస్‌టీయూ పంతమని ఎస్‌టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి బి.వెంగళరెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు స్థానిక ప్రకాశం భవనం వద్ద ఆదివారం సాయంత్రం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వ విధానాన్ని తమ సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. గత 20 సంవత్సరాలుగా ఎంతోమంది ఉపాధ్యాయులు తీవ్ర ఆర్థిక ప్రయోజనాలను కోల్పోయారన్నారు. ఇందుకు నిరసనగా సెప్టెంబర్ 1వ తేదీ బ్లాక్‌డేగా ప్రకటిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కె.యర్రయ్య అధ్యక్షత వహించగా, రాష్ట్ర కార్యదర్శి చల్లా శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.నరసింహారెడ్డి, ఆర్థిక కార్యదర్శి బి.నాగయ్య, జిల్లా నాయకులు షేక్ మౌలాలి, షేక్ యూసఫ్ షరీఫ్, వై.రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానమే ఏపీటీఎఫ్ లక్ష్యం

- ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల



నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ఒంగోలు: పాత పెన్షన్ విధానమే ఏపీటీఎఫ్ లక్ష్యమని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల అన్నారు. స్థానిక ప్రకాశం భవనం వద్ద ఆదివారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగుల నుంచి ఎలాంటి నెలవారీ చందా వసూలు చేయని పాత పెన్షన్ విధానాన్నే ఉద్యోగ, ఉపాధ్యాయులు కోరుతున్నారన్నారు. సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రకటించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నామన్నారు. జోన్ కన్వీనర్ బి.శేషారావు మాట్లాడుతూ సెప్టెంబర్ 1వ తేదీ ఉద్యోగ, ఉపాధ్యాయులు జాతి విద్రోహదినంగా నిర్వహిస్తున్నారన్నారు. సీపీఎస్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా పేర్కొంటున్న యూపీఎస్ విధానాన్ని కూడా ఉపసంహరించుకోవాలన్నారు. సీనియర్ నాయకులు ఐ.విజయసారథి మాట్లాడుతూ పెన్షన్ భిక్షకాదని, అది ఉద్యోగ ఉపాధ్యాయుల హక్కు అని అన్నారు. పూర్వ రాష్ట్ర కార్యదర్శి బి.రఘుబాబు, పూర్వ రాష్ట్ర కౌన్సిలర్ ఎంవీ కృష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షులు కె.తిరుమల, పి.హనుమంతరావు తదితరులు పాల్గొని సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

వర్షానికి కూలిన ఇళ్ల గోడలు



గణపవరంలో కూలిన ఇంటి గోడ

త్రిపురాంతకం: వర్షానికి ఇళ్ల గోడలు కుప్పకూలాయి. త్రిపురాంతకం మండలం గణపవరంలో మాచర్ల చిన్న త్రిపురయ్యకు చెందిన ఇంటి గోడ కూలింది. రాజుపాలెంలోనూ పువ్వాడ పాలంకయ్య ఇంటి గోడ కూలింది. త్రిపురాంతకంకు చెందిన ఎం.రామిరెడ్డి గేదె మృతి చెందింది. వీటిపై స్థానిక తహసీల్దార్ శ్రీనివాసరావు జిల్లా అధికారులకు నివేదిక పంపారు.

మరాఠా రాష్ట్ర కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న మరాఠా రాష్ట్ర కార్యవర్గం

ఒంగోలు: మరాఠా సంక్షేమ సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం స్థానిక క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా అంబురపు వెంకటేశ్వరరావు, డుమ్మే వీరు, కాలే వెంకటేశ్వర్లు, అధ్యక్షునిగా అంబురు వెంకట నాగేంద్రబాబు, కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా జూదాం గంగారాయ తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరాఠాల సమస్యల పరిష్కారానికి కృషిచేయడంతో పాటు మరాఠాల సంక్షేమమే లక్ష్యంగా నూతన కమిటీ బాధ్యతలు నిర్వహిస్తుందన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి రాష్ట్ర వ్యాప్తంగా హాజరైన పలువురు మరాఠా జిల్లాల బాధ్యులు అభినందనలు తెలిపారు.

సాయిబాబా ఆలయంలో చోరీ



ఆలయంలో పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

నాగులుప్పలపాడు (మద్దిపాడు): నాగులుప్పలపాడు మండలంలోని బీ నిడమానూరు గ్రామంలో గల షిరిడీ సాయిబాబా ఆలయంలో శనివారం రాత్రి దొంగలు పడ్డారు. రెండు లక్షల రూపాయల విలువైన వెండి వస్తువులు దొంగిలించారు. గ్రామ నడిబొడ్డునున్న సాయిబాబా ఆలయంలో సుమారు అర్ధరాత్రి రెండు గంటల ప్రాంతంలో దొంగలు చొరబడి స్వామివారి సింహవాహనం దొంగిలించుకుపోయారు. ఆదివారం ఉదయం సాయిబాబా మందిరం ద్వారాలు తెరిచి ఉండటాన్ని గమనించిన గ్రామస్తులు.. పోలీసులకు సమాచారం అందించారు. అర్ధరాత్రి ఆలయ తలుపులు పగులగొట్టి వెండి వస్తువులు దొంగిలించడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దొంగలు కారులో వచ్చినట్లు సమాచారం. వైర్లు కత్తిరించి సీసీ కెమేరా ఫుటేజ్ బాక్సులను తీసుకెళ్లినట్లు తెలుస్తుంది. దొంగతనానికి ఉపయోగించిన గడ్డపారను అక్కడే వదిలేసి వెళ్లారు. సాయిబాబాకు అలంకరించిన గొడుగు, మకర తోరణం జోలికి దొంగలు వెళ్లకపోవడం గమనార్హం. ఒంగోలు రూరల్ సీఐ ఎస్.శ్రీకాంత్, నాగులుప్పలపాడు ఎస్ఐ బి.శ్రీకాంత్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. నాగులుప్పలపాడు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా.. నూతన దంపతులకు గాయాలు



ఆస్పత్రిలో ఉన్న నూతన దంపతులు

పొదిలి రూరల్: ఆటో బోల్తాకొట్టి నూతన దంపతులకు గాయాలైన సంఘటన పొదిలి మండలం మాదాలవారి పాలెం సమీపంలో రామాయణ కండ్రిక స్పీడ్ బ్రేకర్ వద్ద ఆదివారం జరిగింది. మండలంలోని మల్లవరం గ్రామానికి చెందిన పిల్లి ఏడుకొండలుకు పెద్దరావీడు మండలం కర్రల గ్రామానికి చెందిన కళ్యాణితో నాలుగు రోజుల క్రితం వివాహమైంది. మర్లు పెళ్లి ముగించుకుని తిరిగి మల్లవరం వచ్చే క్రమంలో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో నూతన దంపతులతో పాటు ఆటోలో ఉన్న మరో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రులను పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వారిలో ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తీసుకెళ్లారు.

నేడు గ్రీవెన్స్ రద్దు

ఒంగోలు అర్బన్: భారీ వర్షాల నేపథ్యంలో ప్రతి సోమవారం ప్రకాశం భవనంలో కలెక్టర్ నిర్వహించే గ్రీవెన్స్‌ను రద్దు చేసినట్లు కలెక్టరేట్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. కలెక్టర్ గ్రీవెన్స్‌తో పాటు జిల్లా వ్యాప్తంగా మండల స్థాయిలో జరిగే మీ కోసం గ్రీవెన్స్‌ను కూడా తాత్కాలికంగా రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు గమనించి అర్జీలు ఇచ్చేందుకు కలెక్టర్ కార్యాలయానికి, మండల కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లవద్దని కోరారు.

18 మంది జూదరుల అరెస్టు

పొదిలి రూరల్: మండలంలోని మార్కాపురం అడ్డరోడ్డులో పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. పేకాటాడుతున్న 18 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.57,850 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై వేమన మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యకలపాలపై దృష్టి సారించినట్లు చెప్పారు. ఎక్కడైనా జూదాలకు పాల్పడితే ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

రామాపురంలో కొండచిలువ కలకలం



రామాపురంలో పట్టుకున్న కొండచిలువ

రాచర్ల: ట్రాక్టర్‌కు కొండచిలువ చుట్టుకుని ఉన్న సంఘటన రాచర్ల మండలంలోని రామాపురం గ్రామంలో ఆదివారం కలకలం రేపింది. గుడిమెట్ట పంచాయతీ పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన మదిరె వెంకట రంగారెడ్డి తన నివాసం ఎదురుగా ట్రాక్టర్ ఉంచాడు. ట్రాక్టర్ సీటు కింది భాగంలో కొండచిలువ చుట్టుకుని ఉండటాన్ని స్థానికులు చూసి గిద్దలూరు ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్టు రిస్క్ టీమ్ సిబ్బంది అశోక్, ప్రసాదు వెంటనే రామాపురం చేరుకుని ట్రాక్టర్ సీటు కింద ఉన్న 12 అడుగుల కొండచిలువను పట్టుకుని సంచిలో వేసుకుని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లారు.